
సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



ఆపదలో ఆసరా

రెడ్‌క్రాస్ సంస్థ ఆపదలో ఆసరా ఇస్తోంది. అవసరమైన వేళ సాయం చేస్తోంది.

- 8లో



దసరాకు ప్రత్యేక బస్సులు

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. సాధారణ చార్జీలే వసూలు చేస్తారు.

- 8లో

అభ్యంతరాలు తెలియజేయండి

శ్రీకాకుళం రూరల్: ఫార్మసిస్టులు, ఎఫ్ఎన్ఓల పోస్టులకు సంబంధించి అభ్యర్థుల జాబితాను srikakulam.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా వైద్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

న్యూస్‌రీల్

సెకెండ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్ర, అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల 2022–23 అడ్మిటెడ్ బ్యాచ్‌కు చెందిన రెండో సెమిస్టర్ ఫలితాలు గురువారం వెలువడ్డాయి. ఈ ఫలితాలను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్ర వెలువరించారు. మొత్తం కళాశాల విద్యార్థులు 55.86 శాతం ఉత్తీర్ణతను సాధించారు. ఇందులో బీఏ విద్యార్థులు 55.13 శాతం, బీకాం జనరల్ 44.44 శాతం, బీకాం ఒకేషనల్ 90.20 శాతం, బీఎస్సీ 51.34 ఉత్తీర్ణతతో ఫలితాలను సాధించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పీఎస్ కనకదుర్గ, వై.ప్రశాంతి, సీహెచ్ కాత్యాయణి, యు.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల జాబితాను సరిచూసుకోవాలి'



బన్నువాడ గ్రామంలో నిర్వాసిత రైతుల సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమార్

టెక్కలి: మూలపేట పోర్టుకు సంబంధించి నిర్మాణం చేయనున్న అప్రోచ్ రోడ్డులో ఆయా సర్వే నంబర్లతో రైతుల జాబితా సక్రమంగా ఉందో లేదో అనే విషయాన్ని పక్కాగా సరిచూసుకోవాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ ఆదేశించారు. ఇటీవల పోర్టు రోడ్డు ప్రభావిత రైతులతో నిర్వహించిన సమావేశంలో భాగంగా రైతుల అభ్యర్థన మేరకు టెక్కలి మండలం బన్నువాడ, మోదుగువలస, వేములవాడ ప్రాంతాల్లో అధికారులు గురువారం నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్వాసిత రైతుల జాబితాతో ఆయా సర్వే నంబర్లను క్షుణ్ణంగా పరిశీలన చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈయనతో పాటు తహసీల్దార్ కె.ప్రవల్లికప్రియ ఉన్నారు.

గురుకులాల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం



గురుకులంలో మాట్లాడుతున్న డీసీ బాలాజీనాయక్

మందస: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా కృషి చేస్తున్నట్టు జిల్లా సమన్వయాధికారి బాలాజీనాయక్ చెప్పారు. మందస మండలంలోని గురుకులాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గురుకులాల్లో ఉండాలని, ప్రణాళికాబద్ధంగా పాఠాలు బోధించాలన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను కూడా విద్యార్థినులకు వివరించాలని ఆదేశించారు. అకడమిక్ ఆడిట్ బృందం కూడా గురుకులాన్ని సందర్శించింది. రికార్డులు, డార్మిటరీ, క్లాస్ రూమ్స్, మెస్, పాఠశాల ఆవరణ, పనితీరు, గ్రౌండ్‌లను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి, దుప్పలవలస, కొల్లివలస గురుకులాల ప్రిన్సిపల్స్ దేవేంద్రరావు, రామకృష్ణ, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ కె.రామ్మూర్తి ఉన్నారు.

రైతులకు నష్టం లేకుండా ఈ–క్రాప్ నమోదు

వజ్రపుకొత్తూరు: రైతులు నష్టపోకుండా ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని పలాస ఆర్డీవో సీతారామమూర్తి అన్నారు. బెండి పంచాయతీ మహదేవిపురంలో ఈ క్రాప్ నమోదు విధానంలో సూపర్ చెక్‌ను గురువారం చేపట్టారు. పంట పొలాలను పరిశీలించారు. రైతుల వద్దకు వెళ్లి వేసిన పంట, దాని విస్తీర్ణం, స్వభావం అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ ఫలసాయం విక్రయించుకోవాలన్నా, ప్రకృతి వైపరీత్యాలు జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా అందాలన్నా ఈ క్రాప్ నమోదు కీలకమన్నారు. వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, ఎంఆర్ఐ డి.పవిత్ర, ఏవో పి.కిరణ్‌వాణి, ఏఈఓ ఉదయ్‌కుమార్, వీపీఏ రఘు పాల్గొన్నారు.

వంశధారపై దారులు



వంతెన నిర్మాణం జరగనున్న గూడెం వద్ద వంశధార ప్రధాన కాలువ

- వంశధార కాలువపై డబుల్ లైన్ వంతెనలు
- శ్రీకాకుళం రూరల్ ప్రాంత ప్రజలకు మేలు
- మంత్రి ధర్మాన చొరవతో సుదీర్ఘ సమస్యకు పరిష్కారం
- గూడెం, మునసబుపేట వద్ద రెండు వంతెనల నిర్మాణాలకు రూ. 3.01కోట్లు మంజూరు



వంతెన నిర్మాణం జరగనున్న మునసబుపేట వంశధార ప్రధాన కాలువ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : వంశధార కాలువపై కొత్త దారులు ఏర్పడనున్నాయి. ఎన్నో ఏళ్లుగా కాలువ దాటడానికి ఇబ్బందులు పడుతున్న శ్రీకాకుళం రూరల్ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కార్యాచరణ ఆరంభించింది. మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో రూ. 3.01కోట్లతో వంశధార ప్రాజెక్టు ప్రధాన కాలువపై రెండు వంతెనలు ప్రభుత్వం నిర్మించనుంది. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించడమే తరువాయి. ఆ దిశగా మంత్రి ధర్మాన ప్రత్యేక దృష్టి సారించారు. అటు ప్రజలకు, ఇటు రైతులకు మేలు జరిగే వంతెనలు త్వరితగతిన పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

వంతెనల ఆవశ్యకత

జిల్లాలో వంశధార ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ హిరమండలం రిజ్వరాయర్ నుంచి శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలో వరకు వస్తోంది. దీని ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోంది. అయితే జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కుడి ప్రధాన కాలువపై వంతెనలు లేక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కాలువ 44.100 కిలోమీటర్లు గూడెం గ్రామం వద్ద, 48.000వ కిలోమీటర్ మునసబుపేట వద్ద డబుల్‌లైన్ వంతెన నిర్మాణం చాలా అవసరం. చాలా ఏళ్లుగా వంతెనల కోసం స్థానికులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ప్రధానంగా ఈ కాలువకి చుట్టుపక్కల గ్రామాలైన మునసబుపేట, తండ్యాంవలస, లంకాం, సిలగాం సింగువలస, గూడెం, లంకాం, సింగుపురంలతో పాటు పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలెన్నో వచ్చాయి. కానీ ఇక్కడ ఇబ్బందులు తీరలేదు. పాలకులకు మొర పెట్టుకోవడమే తప్ప పరిష్కారం కాలేదు. ప్రతి సారి వినతులివ్వడమే తప్ప మోక్షం లభించడం లేదు.

ప్రయోజనాలివే..

- గూడెం, మునసబు పేట వద్ద డబుల్ లైన్ వంతెనలు నిర్మించడం వల్ల జాతీయ రహదారికి వేగంగా చేరుకోవచ్చు.
- అత్యవసరం వైద్యం కోసం జెమ్స్ ఆస్పత్రికి త్వరగా వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.
- పాలకొండ రోడ్డుకి ఎఫ్‌సీ గోదాములకు సులువుగా చేరుకోవచ్చు. రైతులు పండించే ఆహారధాన్యాల రవాణాకు మార్గం దొరుకుతుంది.

గూడెం వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు చేరుకునేందుకు చాలా సులభమవుతుంది. వంతెనలు పూర్తయితే మిషనరీలు, పెద్దపెద్ద భారీ వాహనాల రాకపోకలకు అనువుగా ఉంటుంది.

- వీటితో పాటు వంతెనల నిర్మాణంతో ఇక్కడున్న భూముల విలువ కూడా భారీగా పెరిగి, రైతులకు లాభం చేకూరుతుంది. ప్రస్తుతం ఎకరా రూ. 30లక్షల నుంచి రూ. 40లక్షలుండే భూముల ధర రూ. కోటి దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

మా కల నెరవేరనుంది



చాలా ఏళ్లుగా బ్రిడ్జి కోసం ఎదురు చూస్తున్నాం. బ్రిడ్జి పూర్తయితే రైతుల పండించే పంట పొలాలకు సాగునీరు పుష్కలంగా లభిస్తుంది. గూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– పొదిలాపు రామారావు, గూడెం, శ్రీకాకుళం రూరల్

ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు



రైతుల సంక్షేమం కోరేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని బ్రిడ్జి మంజూరు చేయడం శుభపరిణామం. మా పరిసర ప్రాంతాల్లో ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఒకే ఏడాదిలో రెండు సార్లు వరి వేసుకునే వెసులుబాటు ఉంటుంది. సుదీర్ఘ సమస్యను ఏ ప్రభుత్వం పట్టించుకోకపోయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందించి, వంతెనల నిర్మాణానికి చొరవ చూపింది.

– బలగ వెంకటరమణ, మునసబుపేట, శ్రీకాకుళం రూరల్

మంత్రి ధర్మాన చొరవ



ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే తమ సమస్య పరిష్కారమవుతుందని ఇక్కడ ప్రాంత ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. దానిలో భాగంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి స్థానిక ప్రజలు తీసుకొచ్చారు. ఆయన వెంటనే స్పందించి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తూ లేఖ రాశారు. ఇక్కడ రెండు వంతెనలు నిర్మిస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయని ప్రభుత్వానికి వివరించారు. వీటి ఆవశ్యకతను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాజాగా రూ.3.05కోట్లతో వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీటితో 10 గ్రామాలకు నేరుగా, 30 గ్రామాలకు పరోక్షంగా ప్రయోజనం కలగనుంది.

అంబులెన్స్‌లో ప్రసవం



బెండిగేటు వంతెనపై ఆగిన అంబులెన్సులో తల్లీబిడ్డలను కాపాడిన సిబ్బంది

కాశీబుగ్గ: మందస మండలం తంగరపుట్టి గ్రామానికి చెందిన సవర శ్యామల అనే గిరిజన గర్భిణి అనంతగిరి పంచాయతీ బెండిగేటు జాతీయ రహదారిపై రాత్రి ఒంటిగంటకు అంబులెన్స్‌లో ప్రసవించారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం రాత్రి శ్యామలకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందజేశారు. 108లో ఆమెను పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తీసుకురాగా అక్కడి నుంచి టెక్కలి రిఫర్ చేశారు. అయితే పలాస నుంచి ఆరుకిలోమీటర్లు వెళ్లే సరికి బెండిగేటు వంతెన వద్ద ఆమెకు నొప్పులు అధికం కావడంతో బండిలోనే ప్రసవం చేశారు. అప్పటికే పేగు బిడ్డ తలకు చుట్టుకోవడంతో ఈఆర్‌సీపీ డాక్టర్ శ్రీకాంత్ సలహాతో 108 సిబ్బంది పాతాళ సత్యం, ఎం రామచంద్రారెడ్డిలు చాకచక్యంగా వేరు చేసి పండంటి మగబిడ్డ ప్రాణాలు నిలిపారు. వారితో పాటు ఆశ వర్కర్ ధనలక్ష్మి తల్లీబిడ్డలకు సపర్యలు చేశారు. అనంతరం టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి అభినందనలు తెలిపారు.

సహిత విద్య ఆర్పీల మెరిట్ జాబితా విడుదల

శ్రీకాకుళం న్యూకాలనీ: సహిత విద్య (భవిత) కేంద్రాల్లో ఖాళీగా ఉన్న రిసోర్స్ పర్సన్ల(ఆర్పీ) భర్తీ ప్రక్రియ ఆఖరి దశకు చేరుకుంది. జిల్లాకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ అనంతరం ఫైనల్ మెరిట్ లిస్టును డీఈఓ శ్రీకాకుళం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని సమగ్రశిక్షా ప్రాజెక్ట్ ఏపీసీ రోణంకి జయప్రకాష్ గురువారం తెలిపారు. వీఐ/హెచ్ఐ, ఎంఆర్ పోస్టులకు సంబంధించి రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు త్వరలో 1:3 లేదా 1:5 ప్రాతిపదికన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలుస్తామని.. తేదీలను రాష్ట్ర అధికారులు త్వరలో ప్రకటిస్తారన్నారు. కాగా జిల్లా నుంచి మెరిట్‌లిస్టుపై సమగ్రశిక్ష జిల్లా కార్యాలయానికి వచ్చి 11 మంది తమ అభ్యంతరాలను తెలియజేసినట్టు జయప్రకాష్ చెప్పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 సహిత విద్య ఆర్పీ పోస్టులను భర్తీ చేయనున్నారు.

మిలటరీ మిడత



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉదయపురంలో ఓ ఇంటిలోకి చొరబడిన మిడత అందరి దృష్టిని ఆకట్టుకుంది. అచ్చం ఆర్మీ దుస్తులను పోలి ఉన్న రంగులో కనిపించడంతో స్థానికులు చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– కాశీబుగ్గ

జిల్లా ప్రధాన తపాలా కార్యాలయంలో

ఆధార్ మేళా

శ్రీకాకుళం అర్బన్: జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోగల ప్రధాన తపాలా కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ ఆధార్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన తపాలా కార్యాలయ అధికారి డి.చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డులో సవరణలు, మొబైల్ నంబర్, పేరు, అడ్రస్ వంటి మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చంద్రశేఖర్ కోరారు.

డీఎల్‌టీసీలో ఘనంగా స్నాతకోత్సవం



టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో అతిథులు, అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం డీఎల్‌టీసీ (ఐటీఐ) శిక్షణ కేంద్రంలో గురువారం స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఉత్తీర్ణులైన విద్యార్థులకు పలువురు అధికారులు చేతులమీదుగా పాస్ సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి మేనేజర్ జె.ఉమామహేశ్వరరావు, పరిశ్రమలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పీవీ రఘునాథరావు, సోనీ ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్ శ్రీకాకుళం ఇన్‌చార్జి మల్లా పృథ్వీల చేతులమీదుగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమోంటోలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఉజ్వలమైన భవిష్యత్‌లను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. నచ్చిన రంగంలో స్థిరపడాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్(శిక్షణ), శిక్షణ సంస్థ ట్రైనింగ్ ఆఫీసర్ వై.లక్ష్మణరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులతో జగనన్న ఇంటిలో ఎమ్మెల్యే కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

గుండె గూటికి

పండగ

- ఇల్లు లేని పేదవాడు ఉండకూడదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్
- లింగాలవలస–చల్లవానిపేట వైఎస్సార్ జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు



గృహ ప్రవేశంలో రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

జలుమూరు: సామాన్యుడి స్వప్నం సాకారమైందని, రాష్ట్రంలో ఇల్లు లేని పేదవారు ఉండకూడదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. లింగాలవలస–చల్లవానిపేట వైఎస్సార్ జగనన్న కాలనీలో గురువారం గృహ ప్రవేశాలు చేసి అనంతరం సభలో మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో 31 లక్షల పట్టాలు అందించారని, ఆ సమయంలో తాను రెవెన్యూ మంత్రిగా ఉండడం గర్వంగా ఉందన్నారు. సీఎం కడుతున్నవి ఇళ్లు మాత్రమే కాదని ఊళ్లని చెప్పడానికి ఈ కాలనీయే ఉదాహరణ అని అన్నారు. రాష్ట్ర ప్రజల్ని అనేక విధాలుగా మోసగించిన టీడీపీని 2019లో ప్రజలు తిరస్కరించారని తెలిపారు. చంద్రబాబు పాపాలు పండి రాజమండ్రి జైలుకు చేరారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి, ఔటర్ రింగ్‌రోడ్డు, ఏపీ ఫైబర్ గ్రిడ్ ఇలా ప్రతి అంశంలో అక్రమాలకు పాల్పడిన చంద్రబాబును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

పేదవాడి కల సాకారం

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ సొంతింటి కోసం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న పేదవాడి కల నవరత్నాలతో సాకారమైందన్నారు. జిల్లాలో 32 వేల ఇళ్ల నిర్మాణాలతో రాష్ట్రంలో మూడోస్థానంలో నిలిచామని తెలిపారు. సుమారు 1.20 లక్షల మందికి పట్టాలు అందించామని, దీని కోసం సుమారు రూ.750 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. జిల్లాలో 700 లే అవుట్లలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, హౌసింగ్ పీడీ నక్క గణపతిరావు, పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, ఎంపీపీ వాన గోపి, డీసీసీబీ మాజీ అధ్యక్షులు డోల జగన్, సారవకోట జెడ్పీటీసీ సభ్యులు వరుదు నాగేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, మాజీ ఎంపీపీ బగ్గ రామకృష్ణ, చల్లవాని పేట పీఏసీఎస్ అధ్యక్షుడు పి.నాజప్పల నాయుడు, ఎంపీటీసీ సభ్యులు పి.భారతి పాల్గొన్నారు.

నెరవేరిన కల



మాది నరసన్నపేట మండలం బడ్డవానిపేట గ్రామం. పదేళ్ల కిందట చల్లవానిపేటకు కడుపు చేతపట్టుకొని వచ్చాము. చిన్న బండి మీద ఫాస్ట్ ఫుడ్ అమ్ముతూ జీవనం సాగించాం. వ్యాపారం అంతంత మాత్రంగానే సాగేది. అద్దె ఇళ్లలో ఏళ్ల పాటు కాలం వెళ్లదీశాం. ఒకటో తేదీ వస్తే చాలు అద్దె కట్టాలనే బెంగ వెంటాడేది. ఇప్పుడు ఆ భయం లేదు. నా సొంతింటి కల నెరవేరింది.

– పొట్నూరు లక్ష్మి

సీఎం దయ వల్ల..




మాది సారవకోట మండలం అనుపురం. ఇరవై ఏళ్ల కిందట కడియం నర్సరీలో పనిచేసేందుకు వెళ్లిపోయాం. ఎనిమిదేళ్ల కిందట చల్లవానిపేట వచ్చి అద్దె ఇళ్లలో కాలం గడుపుతున్నాం. మేము పువ్వులు విక్రయిస్తుంటాం. అద్దెలు కట్టలేక, పిల్లలను సరిగ్గా చదివించలేక నానా ఇబ్బందులు పడ్డాం. సీఎం జగన్ సార్ దయ వల్ల సొంత ఇంటి కల నెరవేరింది. అమ్మ ఒడితో పిల్లల చదువులు సాఫీగా సాగుతున్నాయి.

– యడ్ల కుమారి



జలుమూరు మండలం లింగాలవలస గ్రామంలో వైఎస్సార్ జగనన్న కాలనీ ప్రవేశ ద్వారం

గుండె నిండా కృతజ్ఞత



ఏ ఆస్పత్రికీ వెళ్లకుండా ఉన్న ఊరిలోనే వైద్యం జరిగిందన్న ఆనందం.. దాచుకున్న డబ్బు ఖర్చు చేసే పని లేకుండా ఉచితంగా చికిత్స అందిందన్న సంతోషం.. ఇంటికి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి చూసుకుంటున్నారన్న కృతజ్ఞత.. కలగలిపి ఓ పెద్దాయన తన మెడికల్ రిపోర్టుపై ఉన్న సీఎం వైఎస్ జగన్ చిత్రానికి ఇలా ధన్యవాదాలు తెలిపారు. ఇచ్ఛాపురం మండలం బాలకృష్ణాపురం గ్రామంలో గురువా రం జరిగిన జగనన్న ఆరోగ్య సుర క్ష కార్యక్రమంలో కోట వల్లయ్య అనే వృద్ధుడు సీఎంను ఇలా ఆశీర్వదించారు.

– ఇచ్ఛాపురం రూరల్

నడవలేకున్నా..



జగనన్న ఆరోగ్య సురక్ష అన్ని వయసుల వారికి అండగా నిలుస్తోంది. ఉన్న ఊరికే వచ్చి వైద్యం అందిస్తుండడంతో అన్ని వయసుల వారు సద్వినియోగం చేసుకుంటున్నారు. పలాస మండలం తర్లాకోటలో నడుము సహకరించకున్నా ఓ వృద్ధుడు ఇలా ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చి చికిత్స చేయించుకున్నారు.

– కాశీబుగ్గ

క్లుప్తంగా

15 నుంచి రావివలసలో ధర్మ ప్రచార వారోత్సవాలు

టెక్కలి: ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 21 వరకు టెక్కలి మండలం రావివలస మల్లన్న సన్నిధిలో ధర్మ ప్రచార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఈఓ జి.ప్రసాద్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు యోగా మాస్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దత్తపీఠం స్వామిజీ నిర్విషయానంద నేతృత్వంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాయంత్రం మల్లన్నకు భస్మోదకంతో అభిషేకాలు, 16న భక్తి నృత్య ప్రదర్శనలు, పార్వతీ కల్యాణం హరికథా గానం, సాయంత్రం ప్రదోష కాల గోపూజ, 17న భక్తి సంగీత విభావరి తో పాటు సాయంత్రం చందనోదకంతో స్వామికి అభిషేకం, 18న కూచిపూడి నృత్యాలు, సహస్ర దీపారాధనలు, 19న భజనా కార్యక్రమాలు, పంచామృత అభిషేకాలు, 20న కోలాట నృత్య ప్రదర్శనలు, ఫలోదక అభిషేకాలు, 21న లలిత సహస్ర నామ పారాయణాలు, సహస్ర బిళ్వార్చనతో మల్లన్నకు పూజలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఈఓ వెల్లడించారు.

వికేంద్రీకరణకు మద్దతుగా రావివలసలో పూజలు నేడు

టెక్కలి: పరిపాలన వికేంద్రీకరణకు మద్దతుగా శుక్రవారం టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పరిపాలన వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ నేతృత్వంలో ఉదయం 10.30 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు శ్రీముఖలింగంలో పూజలు చేస్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆకాంక్ష మేరకు విశాఖ పరిపాలన కేంద్రంగా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో తలపెట్టిన వికేంద్రీకరణకు మద్దతుగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి అన్నివర్గాల వారు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

కూలిన మామిడి చెట్టు


రహదారిపై కూలిన మామిడి చెట్టు


బూర్జ: మండలంలోని కొల్లివలస జంక్షన్ (ఆంజనేయ గుడి) వద్ద ప్రధాన రహదారిపై గురువారం మామిడి చెట్టు కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం 3గంటల సమయంలో మండలంలో పలు చోట్ల వర్షం కురిసింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. స్థానికులు చెట్టు కొమ్మలు తొలగించారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ. 3,24,126


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ ఈఓ వాసుదేవరావు సమక్షంలో లెక్కించారు. 29 రోజులకు గాను అమ్మవారి హుండీ ఆదాయం రూ. 3,24,126 వచ్చిందని ఆయన తెలిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ నూలు ఈశ్వరరావు, సభ్యులు కృష్ణారావు, చిన్నారావు తదితరులు ఉన్నారు.

వివాహిత మృతి కేసులో ఐదుగురు అరెస్టు


పరశురాంపురం గ్రామంలో మెళియాపుట్టి ఎస్ఐతో కలిసి కేసు వివరాలు పరిశీలిస్తున్న డీఎస్పీ వాసుదేవరావు

మెళియాపుట్టి: ముకుందాపురం పంచాయతీ పరిధిలోని పరశురాంపురం గ్రామానికి చెందిన వివాహిత జన్ని అశ్విని(21) మృతి కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆమె మృతిపై పలు అనుమానాలు ఉండటంలో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేశారు. అశ్వినిని వరకట్నం తీసుకురావాలని వేధించినట్లు మృతురాలి తల్లి చీర కాంతమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందారోపణలు రుజువు కావడంతో మృతురాలు అశ్విని భర్త జన్ని కృష్ణారావు, అత్తమామలు జన్ని తులసమ్మ, జన్ని పుచ్చన్న, ఆడపడుచులు గొద్దూరు ఆదిలక్ష్మి, గొద్దూరు శ్రీదేవిలను గురువారం శ్రీకాకుళం దిశ డీఎస్పీ సుగ్గు వాసుదేవ్ అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచారు. అనంతరం పాతపట్నం సబ్ జైలుకు రిమాండ్‌కు పంపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

ఆపదలో ఆసరా

- వైపరీత్యాల సేవలో జిల్లా రెడ్‌క్రాస్
- 600 గ్రామాల్లో రెడ్‌క్రాస్ వలంటీర్ల సైన్యంకు శిక్షణలు
- ఐదు తుఫాన్లకు సాయం
- రూ.5కోట్లకు పైగా విలువ గల పునర్నిర్మాణ పనులు
- ఆపద మిత్ర శిక్షణ నిర్వహణ
- నేడు అంతర్జాతీయ విపత్తుల నివారణ దినోత్సవం


ప్రాథమిక చికిత్సపై యువతకు శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్:

ఆపద వచ్చిన ప్రతిసారీ ఆసరాగా నిలుస్తోంది జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నేనున్నానంటూ ముందుకు వచ్చి బాధితులకు అండగా నిలుస్తోంది. జిల్లాలో మూడు దశాబ్దాలుగా రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అందిస్తోంది. దీని ద్వారా ఎందరో పేదలకు పలు రకాల సేవలు అందజేశారు.

ప్రకృతి వైపరీత్యాలపై ప్రత్యేక ప్రాజెక్టు


హుద్‌హుద్ తుఫాను సమయంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు రెడ్‌క్రాస్ సైన్యాన్ని సిద్ధం చేయడం 2006 నుంచి మొదలైంది. సునామీ సమయంలో శ్రీకూర్మంలో 48 సునామీ ఇళ్లు, 10రెస్క్యూ బోట్లు, 300 మందికి వలలు, శ్రీకూర్మంలో రూ.50లక్షలతో బాలికల హైస్కూలు భవన నిర్మాణం చేశారు. అలాగే స్పానిష్ రెడ్‌క్రాస్ సహకారంతో 13 ప్లాట్ ఫారాల నిర్మాణం, 12 స్టోరేజ్ సెంటర్లు, 250 ప్లాస్టిక్ ట్యూబ్‌లు, మార్కెటింగ్ కోసం ఆటో, 2580 ఐస్ బాక్సులు సుమారు రూ.3కోట్ల విలువ గల సామగ్రిని బాధితులకు అందించారు. పైలీన్, లెహర్, హుద్‌హుద్, తిత్లీ తుఫాన్ల సమయంలో 2వేల కిట్లను పంపిణీ చేశారు. ఒక్కో కిట్టులో 22రకాల సామాన్లు ఉంచారు.

8 వేలకు పైగా వలంటీర్ల వ్యవస్థ


సముద్రతీర ప్రాంతంలో వలంటీర్లు

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు 11 సముద్ర తీర ప్రాంతాలు, తుఫాను, వరద తాకిడి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను గుర్తించి ప్రత్యేక శిక్షణ ద్వారా సుమారుగా 8వేల మంది రెడ్‌క్రాస్ సైన్యాన్ని సిద్ధం చేసుకుంది. వీరికి 11 రకాల నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించింది. 104 మత్స్యకార గ్రామాలు, సముద్ర తీరానికి దగ్గరలో ఉన్న గ్రామాలు, నదీ పరివాహక ప్రాంతాలు, గిరిజనుల కొండలపైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఒక పెద్ద సైన్యాన్ని సిద్ధం చేశారు. ఈ వ్యవస్థ ద్వారా ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా ఎదుర్కొనేలా వ్యవస్థను పటిష్ఠం చేశారు. ఆపద మిత్ర, బందరువానిపేట, కొమరవానిపేట గ్రామాల్లోని వారికి శిక్షణ వంటి కార్యక్రమాలతో ముందడుగు వేస్తున్నారు.


అగ్నిబాధితులకు సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్

ఇతర సాయాలు

- జిల్లాలో జరిగే ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగే ప్రమాదాల సమయంలో కూడా రెడ్‌క్రాస్ సాయం చేస్తోంది.
- చెన్నైలో వచ్చిన వరదల సమయంలో జిల్లా పౌర సరఫరాల శాఖ సహాయంతో ఆహార ధాన్యాల కిట్లు, కృష్ణాజిల్లా వరద సాయం కింద 3లారీల రైస్, బట్టలు, తదితరమైనవి పంపారు.
- జిల్లాలో 6500అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.1.17కోట్ల విలువైన కిట్లను పంపిణీ చేశారు.
- కోవిడ్ సమయంలో 152 మందికి అంత్యక్రియలు చేశారు. 1.53 లక్షల ఆహారపొట్లాలు నిస్సహాయులకు అందించారు.

ఆపద వస్తే రెడ్‌క్రాస్ సేనలు

జిల్లాలో ఎలాంటి ఆపదలు సంభవించినా రెడ్‌క్రాస్ సేన ముందుంటుంది. వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అనేక రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం. ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆపద మిత్ర శిక్షణలను కూడా నిర్వహించారు.

– పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్

పార్సిల్ ఓపెన్ చేసి చూస్తే..


స్కెచ్ పెన్నులు చూపిస్తున్న యువకుడు

మెళియాపుట్టి: మండలంలోని పద్ద గ్రామానికి చెందిన జగన్ జెన్నా అనే యువకుడు ఓ ఆన్‌లైన్ షాపింగ్ వేదికలో ఐదు రోజుల కిందట డ్రోన్ కెమెరాను రూ.2,300 పెట్టి బుక్ చేశాడు. గురువారం యాప్ డెలివరీ బాయ్ సంబంధిత పార్సిల్‌ను జెన్నాకు అందజేశాడు. ఆ పార్సిల్ ఓపెన్ చేసి చూస్తే అందులో 15 స్కెచ్ పెన్నులు కనిపించడంతో జెన్నా షాకై పోయాడు. గతంలో కూడా ఈ యాప్ నుంచి అనేక వస్తువులు కొనుగోలు చేశానని ఎప్పుడు ఇలా జరగలేదన్నాడు. యాప్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే ఈ విషయమై ఎస్ఐ వద్ద ప్రస్తావించగా ఎక్కువ మొత్తంలో నగదు చెల్లించి వస్తువులు ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయటం వల్ల మోసాలు జరుగుతాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు



- దూర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు
- సాధారణ చార్జీలతోనే గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రభుత్వ నిర్ణయం
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు

శ్రీకాకుళం అర్బన్:

దసరా పండగ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారిపై ఎలాంటి భారం వేయకుండా సాధారణ చార్జీలతోనే అదనపు బస్సులు ఏర్పాటు చేయనుంది. సాధారణ చార్జీలతోనే 'స్పెషల్' ప్రయాణ సౌకర్యం కల్పించనుంది. పండగకు ముందు, పండగ తర్వాత ప్రయాణించే వారి కోసం నడిపే ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేయరాదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆర్టీసీకి ఉత్తర్వులు కూడా జారీ చేసింది. గత ఏడాది కూడా దసరాకు, పండగకు నడిపే ప్రత్యేక బస్సులకు అదనపు చార్జీలు లేకుండానే నడిపారు.

జిల్లాలోని శ్రీకాకుళం–1, శ్రీకాకుళం–2, టెక్కలి, పలాస డిపోల నుంచి నుంచి ఈ అదనపు సర్వీసులు నడవనున్నాయి. అందుకు తగ్గట్లుగా ఆర్టీసీ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. దసరా పండగ సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ స్కూళ్లు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో అందుకు తగ్గట్లుగా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. పండగ ముందు, పండగ తర్వాత ప్రయాణ రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో దూరప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రత్యేక బస్సుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టారు. దూర ప్రాంత ప్రయాణికులు తమ టికెట్‌లను ఆన్‌లైన్‌లో ముందుగానే రిజర్వేషన్ చేయించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక బస్సులు ఇలా

దసరా సందర్భంగా హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, విశాఖపట్టణం తదితర ప్రాంతాల నుంచి శ్రీకాకుళానికి ఆర్టీసీ బస్సులను నడపనున్నారు. ఈ నెల 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లో ప్రత్యేక బస్సులు శ్రీకాకుళం బయల్దేరనున్నాయి. అలాగే శ్రీకాకుళం నుంచి విశాఖపట్టణంకు 40 ప్రత్యేక బస్సులు వేయనున్నారు. ప్రస్తుతం ప్రతి 5 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ ఉండగా ప్రత్యేక బస్సులతో కలిపి ప్రతి 2 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ బస్సు ఉండనున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇంకా అదనపు బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

10 శాతం రాయితీ

ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. దసరా పండగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ముందస్తుగా టికెట్ రిజర్వేషన్ చేయించుకుంటే ప్రయాణ చార్జీలో 10శాతం రాయితీ ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక బస్సులకు 50శాతం అదనంగా వసూలు చేసేవారు. అయితే ఇందుకు భిన్నంగా గత రెండేళ్లుగా ప్రయాణికులపై ఎలాంటి అదనపు భారం లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చూస్తోంది. గత ఏడాది ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు రాను, పోను టికెట్ తీసుకుంటే 10శాతం రాయితీ ఇచ్చారు. ఈ దఫా పండగకు ఏ వైపు టికెట్ తీసుకున్నా 10శాతం రాయితీ వర్తిస్తుంది. అదే రెండు వైపులా టికెట్ తీసుకుంటే 20శాతం రాయితీ వర్తిస్తుంది.

సాధారణ చార్జీలతోనే..



దసరా సందర్భంగా వివిధ దూర ప్రాంతాల నుంచి శ్రీకాకుళంకు, తిరుగు ప్రయాణ సమయంలో శ్రీకాకుళం నుంచి దూరప్రాంతాలకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీల వసూళ్లు ఉండవు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే వసూలు చేస్తాం. ప్రయాణికులు టికెట్‌లను ఆన్‌లైన్‌లో ముందుగానే రిజర్వేషన్ చేసుకోవచ్చు.

– ఎ.విజయ్‌కుమార్, డీపీటీఓ

యువక్లబ్‌లతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి


డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు యువక్లబ్ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జిల్లా పర్యాటక శాఖాధికారి నారాయణస్వామి

ఆమదాలవలస: జిల్లాలో పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యత, విశిష్టతను తెలియజేసి, వాటిని మరింత అభివృద్ధి చేసేందుకు యువక్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి ఎస్.నారాయణస్వామి తెలిపారు. పట్టణంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భవిత పాఠశాలలో పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు గురువారం అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుబడిన జిల్లాగా పేర్కొంటున్న శ్రీకాకుళం జిల్లాలో 114 చారిత్రాత్మక ప్రదేశాలు, 67 బీచ్‌లు ఉన్నాయన్నారు. వాటి ప్రాధాన్యతను అందరికీ తెలియజేసేలా యువక్లబ్‌లు పనిచేస్తాయన్నారు. ఒక్కో క్లబ్‌కు 30 మంది వరకు ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులను నియమిస్తామని తెలిపారు. వీరికి వీటి ప్రాధాన్యతను ప్రజలకు విస్తృతంగా తెలియజేందుకు అవగాహన కార్యక్రమాలు భవిష్యత్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. యువక్లబ్‌ల ఏర్పాటుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలను పాఠశాల, కళాశాల యాజమాన్యాలకు అప్పగించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి, పర్యాటక జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.ఈశ్వరరావు, భవిత పాఠశాల కరస్పాండెంట్ ఎస్.మురళీధరరావు, హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'పెంచిన సంక్షేమ నిధి స్టాంపు రుసుం ఉపసంహరించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయంతో న్యాయవాదుల సంక్షేమ నిధి స్టాంపుల రుసుంను ఒక్కసారిగా రూ.20కు పెంచడాన్ని నిరసిస్తూ ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించేందుకు తీర్మానం చేశారు. జిల్లా న్యాయవాదుల బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం కోర్టు బార్ హాల్‌లో అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా న్యాయవాదుల సంక్షేమం నిధి పెంపు, ఇటీవల పెంచిన సంక్షేమ స్టాంపులు అంశాలపై న్యాయవాదులు సుదీర్ఘంగా చర్చించారు. 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

'యువ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి'


మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎం జె.ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు యువ పారిశ్రామికవేత్తలుగా ఎదిగి పది మందికి ఉపాధి అవకాశం కల్పించే స్థాయికి చేరుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ జె.ఉమామహేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో గురువారం వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు పారిశ్రామికంగా ఉన్న అవకాశాలను వివరించారు. విద్య పూర్తయిన తర్వాత ఆసక్తిని బట్టి పరిశ్రమలను ఏర్పాటు చేయాలనేవారికి ప్రభుత్వం తరఫున అవకాశాలు కల్పిస్తామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఎన్నో రాయితీలను కల్పిస్తున్నట్టు వివరించారు. కళాశాల వాణిజ్యశాఖ విభాగాధిపతి ఎల్.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు నూతన వ్యవస్థాపకులుగా రూపొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, కామర్స్ అధ్యాపకులు సంతోషి పట్నాయక్, లలితాబాయ్, ఇండస్ట్రియల్ ఏడీ రఘునాథరావు, ఇండస్ట్రియల్ ప్రమోటర్ దిలీప్, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ చిన్నారావు, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.ప్రభాకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయ గురుకులంలో దూరదర్శన్ 'సప్తగిరి'


షూటింగ్ చేస్తున్న దూరదర్శన్ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: కళ్లేపల్లిలో ఉన్న సంప్రదాయం కూచిపూడి గురుకులంలో సప్తగిరి దూరదర్శన్ చానెల్ ప్రతినిధులు అక్కడి కూచిపూడి నృత్యాలను రికార్డు చేస్తున్నారని సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ్ తెలిపారు. సప్తగిరి చానెల్ దర్శకులు శైలజారావు, నిర్మాత జగన్నాథ రెడ్డి, కెమెరామెన్‌లు గణేష్, హరి, రమేష్‌ల ఆధ్వర్యంలో 6గంటల పాటు నృత్యాలను రికార్డింగ్ చేశారు.

మూడు నెలల కిందట దూరదర్శన్ నిర్వహించిన టెస్టులో బి గ్రేడ్ ఆర్టిస్టులుగా ఇక్కడి డ్యాన్సర్లు లీలాకృష్ణ, యామిని, లోకేశ్వరి, అంజలి, బలరాంలు ఎంపిక కావడంతో వారి నృత్యాలను రికార్డు చేశారు. దూరదర్శన్ చరిత్రలో మొట్టమొదటి సారిగా ఈ రికార్డింగు జరిగిందన్నారు. మొత్తంగా 6గంటల పాటు 3బ్యాలేలు, 12 సోలోలు, 2 జానపదాలు రికార్డు చేశారు. దాదాపు రెండేళ్ల వాటిని సప్తగిరి చానెల్‌లో ప్రదర్శించేందుకు వీలుగా రికార్డు చేసినట్లు చెప్పారు.


షూటింగ్‌లో తీసిన దృశ్యాలు

జడూరు పోస్టాఫీస్‌లో చేతివాటం

- రూ.10 లక్షలు వరకూ అక్రమాలు జరిగినట్లు అంచనా
- ఇప్పటికి రూ. 2 లక్షలు గుర్తించిన తనిఖీ అధికారులు
- కొనసాగుతున్న దర్యాప్తు


ఖాతాదారుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్

నరసన్నపేట:

పోలాకి మండలం జడూరు పోస్టాఫీస్ బీపీఓ కూన అనుపమ చేతివాటం చూపారు. చిన్న మొత్తాలు పొదుపు స్కీమ్స్‌తో పాటు, ఆర్‌డీలు, పలు పథకాలు, సేవింగ్ అకౌంట్ ఖాతాదారులు ఇచ్చిన డబ్బును వారి ఖాతాల్లో వేయకుండా తన సొంతానికి వాడుకున్నట్లు తేలింది. జడూరు పోస్టాఫీస్ పరిధిలోని జిల్లోడువలస, జిల్లోడు మాకివలస, తామరాపల్లి, శివరాంపురం, పాత జడూరు, కొత్త జడూరు, జడూరు కాలనీల్లో ఖాతాదారుల నుంచి డబ్బు కాజేసినట్లు పోస్టల్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ విధంగా ఆమె కాజేసిన డబ్బు రూ. 10 లక్షల వరకూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కొంత మంది ఖాతాదారుల నుంచి కాజేసిన డబ్బుకు ఖాతాదారుల ఒత్తిడి మేరకు ప్రోనోట్లు కూడా రాసి ఇచ్చినట్లు తెలుస్తోంది. జడూరు పోస్టాఫీసులో 290 ఆర్‌డీ పాస్ బుక్స్ ఉండగా వీటిలో 121 పాస్ బుక్స్‌ను అధికారులు పరిశీలించారు. వీటిల్లో రూ. 2 లక్షల మేరకు చేతివాటం చేసినట్లు నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. మొత్తం ఖాతాదారులు, ఆర్డీ పాస్ బుక్స్ తనిఖీ చేస్తే ఎంత మేరకు అవకతవకలు జరిగాయో తెలుస్తుందని తనిఖీ అధికారి పోస్టల్ శాఖ ఈస్ట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖరావు తెలిపారు. జడూరు పోస్టాఫీస్ పరిధిలో ఉన్న ఏడు గ్రామాల్లో దండోరా వేయించామని అన్నారు. ఖాతాదారులు వచ్చి తమ ఖాతాలు సక్రమంగా ఉన్నాయో లేదో తెలుసుకోవాలని కోరారు. గురువారం పోస్టాఫీస్‌కు స్థానిక విలేకరులు వెళ్లగా అవకతవకల విషయం బయటపడింది. అక్కడే దర్యాప్తు చేస్తున్న షణ్ముఖరావు మాట్లాడుతూ ఇప్పటి వరకూ రూ. 2 లక్షల వరకూ లెక్క దొరికిందని చెప్పారు. ఈ నెల 5న పోస్టాఫీసులో అవకతవకలు తమ దృష్టికి వచ్చాయని, వెంటనే బీపీఓను సస్పెండ్ చేశామని చెప్పారు. దర్యాప్తు జరుగుతోందని, ఖాతాదారులు సహకరిస్తే త్వరితగతిన ఎంక్వయిరీ పూర్తవుతుందని తెలిపారు.

ఎవరో.. ఏ తల్లి కన్నబిడ్డలో..?


సోంపేట రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్ ఫారంపైన 30–35 వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు స్టేషన్ సిబ్బంది గురువారం ఉదయం గుర్తించి, పలాస జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ తన సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి ఛామన ఛాయలో ఉన్నాడని, ఐదున్నర అడుగుల ఎత్తు, నలుపు రంగు జుట్టు, ఆకుపచ్చ రంగు గల కంబళి కప్పుకుని ఉన్నాడని వివరించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, మృతుడి కుడిచేయి మీద భారతి అని హిందీలో పచ్చబొట్టు ఉందన్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గార: బీచ్‌లో మృతదేహం

గార: కళింగపట్నం–మత్స్యలేశం బీచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సాగర సంగమం సమీపంలో ఈ మృతదేహం ఉన్నట్టు స్థానికులు గురువారం ఉదయం చూసి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి


శ్రీకాకుళం క్రైమ్ : గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.లక్ష్మి తెలిపారు. గత కొంతకాలంగా ఇదే పరిసర ప్రాంతాల్లో యాచక వృత్తి చేస్తూ తిరిగేవాడని, గురువారం ఓ రెస్టారెంటు సమీపంలో పడిపోయి ఉండటంతో స్థానికులు సంబంధిత వీఆర్వోకు, రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మి పేర్కొన్నారు.